క్లుప్తంగా

పర్యాటకులను ఆకర్షించేలా తీర్చిదిద్దాలి

● జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి



పార్కును పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి

గరుగుబిల్లి: పర్యాటకులను ఆకర్షించేలా ఐటీడీఏ పార్కును తీర్చిదిద్దాలని జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని తోటపల్లి కుడి మట్టి కట్ట పరిసరాలలో ఉన్న ఐటీడీఏ పార్కును ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కులో ఉన్న సౌకర్యాలు, వసతులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్కులో జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలన్నారు. పార్క్ అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు చేయాలని ఆదేశించారు. బోటింగ్‌తో పాటు ఇతర సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. పరిశీలనలో ఏపీఓ మురళీధర్, ఏఈ తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్ట్

పాలకొండ: ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్యకరంగా కామెంట్ చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ఎం.రాంబాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలకొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పడాల భూదేవి ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన పోస్టు కింద ఓ వ్యక్తి అసభ్యకరంగా కామెంట్ పెట్టాడు. దీంతో ఆమె సీతంపేట పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 19న ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతికతను ఉపయోగించి ఆ వ్యక్తి తెలంగాణ రాష్ట్రం నల్గొండ ప్రాంతనికి చెందిన గిరిబాబుగా గుర్తించారు. ఇటీవల గిరిబాబు పాలకొండ కోటదుర్గమ్మ ఉత్సవాలకు రావడంతో ఆయన్ని అదుపులోకి తీసుకున్నారు. స్వతహాగా కాంగ్రెస్ పార్టీ అభిమాని అయిన గిరిబాబు చంద్రబాబునాయుడుతో భూదేవి ఉన్న ఫొటోను చూసి అక్కసుతో అసభ్యకరంగా కామెంట్ పెట్టినట్లు పోలీసు విచారణలో తేలింది. కేసు త్వరితగతిన ఛేదించిన సీఐ ప్రసాదరావు, సీతంపేట ఎస్సై అమ్మన్నరావులను డీఎస్పీ అభినందించారు.

మహిళా రక్షణకు ప్రత్యేక చట్టాలు



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్ సభ్యులు

పాలకొండ రూరల్: మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలున్నాయని శక్తి టీమ్ పర్యవేక్షకురాలు, ఏఎస్సై జి.ఝాన్సీబాయి అన్నారు. పట్టణ పరిధిలోని ఆకాష్ పారామెడికల్ శిక్షణ కేంద్రంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవ్‌టీజింగ్, మాదక ద్రవ్యాల వినియోగం, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో శక్తి టీమ్ సభ్యులు ఏ.రాము, ప్రకృతాంబ, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బృందాల తనిఖీలు

పాలకొండ రూరల్: కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ 2.0 పేరిట కేంద్రబృందాలు బుధవారం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. బృంద సభ్యులు శ్రీనివాసరావు, తదితరులు స్థానిక నీలమ్మ కాలనీ, ఆంజనేయనగర్ కాలనీల్లో గల కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. రికార్డుల్లో పేర్కొనబడిన వారిని నేరుగా కలసి వారి సంతృప్తి స్థాయి, సలహాలు, సూచనలను స్వీకరించారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం



కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీఓ గోపాలరావు

గరుగుబిల్లి: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ 4 కార్యక్రమం అమలు చేస్తున్నట్లు ఎంపీడీఓ జి.పైడితల్లి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేసి, సమాజంలో పేదరికం తొలగించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ గోపాలరావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 2025 – 26 విద్యాసంవత్సరానికి గాను 6,7,8,9, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న మిగులు సీట్ల భర్తీకి అర్హులైన ఎస్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ వీర్‌సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 – 26లో ఏకలవ్య ప్రవేశపరీక్ష రాసినవారు ఆరో తరగతి ప్రవేశానికి అర్హులన్నారు. మిగిలిన తరగతులకు కింది తరగతిలో ఉత్తీర్ణులైన అర్హులని.. ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నారికేళం బహుప్రియం..



కొబ్బరికాయలు

● భారీగా పెరిగిన కొబ్బరికాయల ధరలు
● గతేడాది కంటే రెండింతలు పెరిగిన ధర
● జిల్లాలో కొబ్బరి పంట అంతంతమాత్రమే

వీరఘట్టం:

పెళ్లిళ్లు, పండగలు, గృహ ప్రవేశాలు, శుభకార్యాలు ఇలా కార్యక్రమం ఏదైనా కొబ్బరికాయ కొట్టాల్సిందే. అలాగే బేకరీలు, హోటళ్లు, స్వీట్ షాపులు, ఇళ్లల్లో నిత్యం కొబ్బరికాయలు వినియోగిస్తుంటారు. మానవుని దైనందిన జీవితంలో కొబ్బరికాయకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. అయితే గతేడాది వరకు ఒక కొబ్బరికాయ సైజును బట్టి రూ.15 నుంచి 20 రూపాయల వరకు ధర పలికింది. ఈ ఏడాది ఒక్కసారిగా ధరలు రెట్టింపయ్యాయి. ప్రస్తుతం జిల్లాలోని అన్ని పట్టణాల్లో కొబ్బరికాయల ధరలు రూ.35 నుంచి 40 రూపాయల మధ్య పలుకుతున్నాయి. దసరా శరన్నవరాత్రులు కావడంతో గుడికి వెళ్లే భక్తులు.. అలాగే భవానీ దీక్షలు చేపట్టిన భక్తులు అధిక సంఖ్యలో కొబ్బరికాయలు కొనుగోలు చేస్తుండడంతో గిరాకీ బాగా పెరిగింది.

ఇదీ పరిస్థితి....

జిల్లాలో దాదాపు 250 ఎకరాల్లో కొబ్బరి పంట సాగులో ఉన్నప్పటికీ.. బొండాల సమయంలోనే దిగుబడి తీసేస్తున్నారు. వీటిని ఎక్కువగా ఆరోగ్య సమస్యలు ఉన్నవారు, సాధారణంగా చలవ కోసం కొబ్బరి నీరు తాగే వారు వినియోగిస్తున్నారు. దీంతో ప్రజలకు అవసరమైన కొబ్బరికాయలు లభించడం లేదు. ఈ పరిస్థితుల్లో శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతం నుంచి.. ఉభయ గోదావరి జిల్లాల నుంచి కొబ్బరికాయలను స్థానిక వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో వ్యాపారులు వారికి నచ్చిన ధరకు విక్రయస్తున్నారు.

రోజుకు రూ.30 లక్షల వ్యాపారం..

దేవాలయాలు, గోపురాలు, ఇంటి, తదితర అవసరాలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా రోజుకు రూ. 30 లక్షల కొబ్బరికాయల వ్యాపారం జరుగుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. సాధారణ రోజుల్లో రోజుకు 50 వేల నుంచి 60 వేల కొబ్బరికాయల అమ్మకాలు జరుగుతుండగా, ప్రస్తుతం దసరా సీజన్ కావడంతో రోజుకు లక్ష వరకు కొబ్బరికాయులు అమ్మకాలు జరుగుతున్నాయి. వచ్చే నెల నుంచి కార్తీకమాసం ప్రారంభం కానుండడంతో అయ్యప్ప, శివస్వాములు వేల సంఖ్యలో మాలాధరణ చేస్తారు. అంతే కాకుండా దేవాలయాలకు భక్తుల రద్దీ కూడా ఎక్కువగా ఉంటుంది. ఈ లెక్కన కొబ్బరికాయల వినియోగం ఇంకా పెరిగే అవకాశం ఉంది.

కొనలేకపోతున్నాం..



ఇటీవల వినాయకచవితికి ఒక్కో కొబ్బరికాయ 25 రూపాయల చొప్పున కొనుగోలు చేశాం. నెల రోజులు కాకముందే కాయ ధర అమాంతం 40 రూపాయలకు చేరుకుంది. అలాగే అరటి పండ్లు, ఇతర పూజా సామగ్రి ధరలు కూడా బాగా పెరిగాయి. కార్తీకమాసంలో కొబ్బరికాయలు ఎలా కొనాలో అర్థం కావడం లేదు. – వి.శ్రీనివాసరావు, భక్తుడు, వీరఘట్టం

కొబ్బరి సాగు అంతంతే..

జిల్లాలో సుమారు 250 ఎకరాల్లో కొబ్బరిసాగు జరుగుతోంది. అరకొరగా వచ్చే ఈ కొబ్బరికాయలను ఎక్కువగా తాగేందుకు వినియోగిస్తున్నారు. గుడిలో కొట్టే కొబ్బరికాయలను ప్రస్తుతం వ్యాపారులు ఉద్దానం, ఉభయ గోదావరి జిల్లాల నుంచి దిగుమతి చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితిని ప్రభుత్వానికి నివేదించి కొబ్బరిసాగు పెంచేందుకు చర్యలు చేపడతాం. – సత్యనారాయణ రెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖాధికారి

ధరలు బాగా పెరిగాయి..



కేరళ, తమిళనాడు రాష్ట్రాలలో గతంలో వచ్చిన వరదలకు కొబ్బరి పంటకు భారీ నష్టం కలగడంతో ప్రస్తుతం వారంతా మన రాష్ట్రం నుంచి కొబ్బరికాయలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో కొబ్బరికి డిమాండ్ పెరగడంతో ధరలు బాగా పెరిగాయి. ఒక్కో కాయ 40 రూపాయల చొప్పున విక్రయిస్తుంటే కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు. కార్తీకమాసంలో మరింత ధర పెరిగి అవకాశం ఉంది.

– కె.రవి, కొబ్బరికాయల వ్యాపారి, వీరఘట్టం

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానని చెప్పండి



మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డితో పాముల పుష్పశ్రీవాణి, శత్రుచర్ల పరీక్షిత్‌రాజు



మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే కళావతి

● ప్రజా సమస్యలపై మీ పోరాటం అద్భుతం
● కళావతిని అభినందించిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వీరఘట్టం: పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని చెప్పండి.. ప్రజా సమస్యలపై మీరు చేస్తున్న పోరాటం అద్భుతం.. ఇదే స్ఫూర్తితో కార్యకర్తల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచించారని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి తెలిపారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జగన్ మోహన్‌రెడ్డిని బుధవారం కలసి స్థానిక సమస్యలపై చర్చించినట్లు చెప్పారు. అక్కడ నుంచి ఆమె సాక్షితో ఫోన్‌లో మాట్లాడుతూ.. అర్హులైన ఎంతోమంది తల్లులకు తల్లికివందనం నిధులు పడలేదని.. వితంతవులకు పింఛన్లు మంజూరు కావడం లేదని.. అటువంటి వారికి అండగా ఉండి పోరాటం చేయాలని జగనన్న సూచించారని తెలిపారు. ఉచిత బస్సు పథకంతో జీవనోపాధి కోల్పోయిన ఆటో, క్యాబ్ డ్రైవర్లుకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారని చెప్పారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో మోసపోయిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికవర్గాలకు నేనున్నాననే భరోసా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చారని చెప్పారు. 2029లో వైఎస్సార్‌సీపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని.. అన్ని వర్గాల ప్రజల కష్టాలు తీరుతాయని చెప్పారన్నారు. అలాగే పాలకొండ నియోజకవర్గంలో కూటమి నాయకులు చేస్తున్న అక్రమాలు, అన్యాయాలను జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. గిరిజనుల రేషన్ కష్టాలు, రైతుల యూరియా ఇబ్బందులు, తోటపల్లి ప్రాజెక్ట్ పనులు, తదితర అంశాలను ఆయనకు వివరించినట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తోటపల్లి రైతులకు పుష్కలంగా నీరందిస్తామని, రైతన్నలకు అండగా ఉంటామని జగనన్న భరోసా ఇచ్చారని మాజీ ఎమ్మెల్యే కళావతి తెలిపారు.

మర్యాపూర్వక కలయిక ..

కురుపాం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి, ఆమె భర్త పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు తాడేపల్లిలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిస్థితిని ఆయనకు వివరించడంతో పాటు పార్టీ పరిస్థితిపై చర్చించారు.

చేయూతనందించాలి..

● డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంబాబు



వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన త్రిషను సన్మానిస్తున్న అధ్యాపకులు

పాలకొండ రూరల్: రేపటి మెరుగైన సమాజానికి యువత చేయూతనందించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్యాంబాబు అన్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ – 1,2 ఆధ్వర్యంలో జాతీయ సేవా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ.. సమాజ సేవ, మూఢ విశ్వాసాలపై ప్రజలను చైతన్యపరచడం, పరిసరాల పరిశుభ్రతపై సూచనలు చేశారు. అనంతరం యూనివర్సిటీ స్థాయిలో ఇటీవల జరిగిన వ్యాసరచన పోటీల్లో సత్తా చాటిన విద్యార్థిని ఎస్.త్రిషను సత్కరించారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ అధికారి వెలమల అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేమూరు హరగోపాల్ సేవా పథకం విశిష్టతను వివరించారు.

మనుమకొండ అభివృద్ధికి కృషి

● కలెక్టర్ ప్రభాకరరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

సీతంపేట: నీతి అయోగ్ ద్వారా ఆస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రాం కింద ఆదర్శ గ్రామంగా ఎంపికైన భామిని మండలం మనుమకొండ గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రభాకరరెడ్డి అన్నారు. భామిని మండల అధికారులతో బుధవారం స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని వీధులన్నీ పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలన్నారు. నీతి అయోగ్ సూచించిన 40 సూత్రాలను అమలు చేయాలని ఆదేశించారు. మోడల్ అంగన్‌వాడీ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇతర అభివృద్ధి పనులు కూడా త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పాలకొండ సబ్‌కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, తదితరులు పాల్గొన్నారు.

వేదికను సద్వినియోగం చేసుకోండి

కురుపాం: గ్రామ సచివాలయంలో ప్రతి గురువారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు ఆదేశాల మేరకు ప్రతి గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియజేస్తే పరిష్కరిస్తామన్నారు.

సూచనలు, సలహాలు పాటించాలి



రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

కురుపాం: వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలను రైతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి పి.నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని వలసబల్లేరు సచివాలయ పరిధిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పైరుకు తెగుళ్లు ఆశిస్తే నీమాస్త్రం పిచికారీ చేయాలని సూచించారు. అలాగే గట్లపై కంది, తీగజాతి, పండ్ల మొక్కలు, కూరగాయలు సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నీలకంఠశ్వరరావు, సచివాలయం వీఏఏ మహేశ్వరి, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, డీఎంఎంటీ సన్నిదొర, తిరుపతి , మిన్నారావు, రైతులు పాల్గొన్నారు.

కోళ్లు, పాడి పశువుల పెంపకంతో ఉపాధి



స్వయం ఉపాధిపై అవగాహన కల్పిస్తున్న కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ధ్రువ

గుమ్మలక్ష్మీపురం: కోళ్లు, పాడి పశువుల పెంపకంతో స్వయం ఉపాధి పొందవచ్చని రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ ధ్రువ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేవీకే శాస్త్రవేత్తలు స్వయం ఉపాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారుల సూచనలు, సలహాల ప్రకారం కోళ్లు, పశువులు పెంచాలన్నారు. అనంతరం రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఉమాజ్యోతి, అనుజి, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డే

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎన్ఎస్ఎస్ పీఓ రామయ్య మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐక్యూ కోర్డినేటర్ స్వరూప కల్పన, ప్రభాకర్, తులసి, తదితరులు పాల్గొన్నారు.

● తనిఖీ..



భామిని మండలం తాలాడలో నిర్వహిస్తున్న 104 వాహన వైద్య సేవలను జిల్లా మేనేజర్ ఎస్.కృష్ణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, అందుతున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో 104 వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఉన్నారు. – భామిని

వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే బలం

● రాష్ట్ర ప్రచార విభాగ కార్యదర్శి మాధవనాయుడు



మాధవనాయుడు

గరుగుబిల్లి: వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే బలమని..కొంతమంది నాయకులు తమ వ్యక్తిగత స్వార్థంతో ఇతర పార్టీలలో చేరినంత మాత్రాన ఆ ప్రభావం వైఎస్సార్‌సీపీపై ఉండదని రాష్ట్ర ప్రచార విభాగ కార్యదర్శి దాసరి మాధవనాయుడు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. 2014లో ముగ్గురు ఎంపీటీసీలు ఉన్నప్పటికీ, 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మండలం నుంచి వైఎస్సార్‌సీపీకి అధిక మెజార్టీ వచ్చిందని చెప్పారు. నాయకులు మారుతున్నారే తప్ప కార్యకర్తలు, అభిమానులు నేటికీ జగనన్న వెంటే ఉన్నారని చెప్పారు. మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు నాయకత్వంపై ప్రతి ఒక్కరికీ నమ్మకం ఉందన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా పుష్పశ్రీవాణిని ఎమ్మెల్యేగా.. జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు.

చురుగ్గా అభివృద్ధి పనులు



గొంగాడవీధిలో నిర్మాణంలో ఉన్న డ్రైయిన్

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరులో ఉప సర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం ఎక్కేందుకు వీలుగా ఐరన్ స్టైర్‌కేస్ (నిచ్చెన) ఏర్పాటు చేశారు. అలాగే గ్రామంలోని గొంగాడవీధి నుంచి మురుగునీరు పోయేందుకు.. వర్షాలు కురిసిన సమయంలో నీరు పోయేందుకు వీలుగా సీసీ డ్రైయిన్లు నిర్మిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి పాపారావు పనులను పర్యవేక్షిస్తున్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి



వెద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి భాస్కరరావు

కొమరాడ: మహిళల ఆరోగ్యం కోసం స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి ఎస్.భాస్కరరావు అన్నారు. మండలంలోని విక్రమపురంలో బుధవారం నిర్వహించిన ఆరోగ్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గర్భిణులు, వృద్ధులతో మాట్లాడుతూ.. అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 17 నుంచి వచ్చే నెల 2 వరకు జిల్లా వ్యాప్తంగా 339 వైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరాల్లో బీపీ, సుగర్, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, రక్తహీనత, పౌష్టికాహార లోపాలు గుర్తించడం వంటివి చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు, వైద్యులు దేవేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

సొంతింటితో సామాజిక గౌరవం

● హోలీక్రాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్



మూలగూడలో పూర్తి చేసిన గృహాలను ప్రారంభిస్తున్న డైరెక్టర్ ప్రభుదాస్, లబ్ధిదారులు

భామిని: సొంతిల్లు ఉన్నవారికి సామాజిక గౌరవం లభిస్తుందని హోలీక్రాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ అన్నారు. ఈ మేరకు సంస్థ ఆర్థిక సహాయంతో మండలంలోని మూలగూడలో పూర్తి చేసుకున్న ఆరు గృహాలను లబ్ధిదారులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవసరమైన వారికి గృహ నిర్మాణాలకు ఆర్థిక సహాయం, నిర్మాణ సామగ్రి అందిస్తున్నట్లు చెప్పారు. మొదటి విడతగా 40 అసంపూర్తి గృహాలు పూర్తి చేసినట్లు సంస్థ ప్రతినిధులు కొండగొర్రి ప్రసాదరావు, బిడ్డిక చౌదరి వివరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ రజనీకాంత్, హౌసింగ్ సిబ్బంది, సంస్థ ప్రతినిధి కీర్తిరాయి సుగ్రీవులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై పోరాటం



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ మండలశాఖ అధ్యక్షుడు సింహాచలం

వీరఘట్టం: రైతు సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం పోరాడుతోందని ఆ సంఘ మండల అధ్యక్షుడు ఎస్. సింహాచలం అన్నారు. మండలంలోని కడకెల్ల గ్రామంలో బుధవారం ఆయన పర్యటించి, రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శ్రమకు తగ్గ వేతనం రావడం లేదని.. నిత్యావసర సరుకులు, విద్యుత్ చార్జీలు పెరగడంతో జీవనం అతలాకుతలమైందని ఈ సందర్భంగా పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్య పరిష్కారానికి సంఘం తరపున పోరాటం చేస్తామని సింహాచలం చెప్పారు.

ఆరోగ్య రక్షణపై ప్రత్యేక దృష్టి

● డాక్టర్ సుజయ్‌కుమార్



రోగిని పరీక్షిస్తున్న వైద్యాధికారి సుజయ్‌కుమార్

పాలకొండ రూరల్: గ్రామీణ ప్రజల ఆరోగ్యో రక్షణపై క్షేత్ర సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి సుజయ్‌కుమార్ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని తంపటాపల్లిలో బుధవారం నిర్వహించిన వైద్యశిబిరంలో ఆయన గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తహీనత, పౌష్టికాహార లోపం బారిన పడకుండా ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

స్పందించకుంటే ఉద్యమిస్తాం

● వైఎస్సార్‌సీపీ నాయకులు



బత్తులవాని చెరువు వద్ద మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాలకొండ రూరల్: పట్టణంలో సేకరిస్తున్న చెత్తను పాలకొండ మండలం ఓని గ్రామ రహదారిలో గల బత్తులవాని చెరువుల్లో పడేయడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు, వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్, మండల సర్పంచ్‌ల సంఘ ఉపాధ్యక్షుడు తిర్లంగి ఉపేంద్రకుమార్ అన్నారు. బాధిత గ్రామస్తులతో కలిసి బుధవారం ఆ చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ ప్రాంత సాగునీటి చెరువుల్లో చెత్త వేయడంతో సమీపంలోని లుంబూరు, జగనన్న కాలనీ, గరుగుబిల్లి, గుడివాడ, కొత్త ఊరు, డెప్పిగూడ, పులి గుమ్మి, తదిత గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి చెత్త తరలించకుంటే ఉద్యమం చేపట్టక తప్పదని స్పష్టం చేశారు. వీరి వెంట పార్టీ నాయకులు, ప్రజలు నెల్లి నాగభూషణరావు, టి.సింహాచలం, జనార్ధనరావు, రైతులు ఉన్నారు.

పారిశుధ్యం మెరుగుకు సహకరించండి

● జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు



గరుగుబిల్లి: సుంకిలో పారిశుధ్యం నిర్వహణపై సూచనలు చేస్తున్న డీపీఓ కొండలరావు

గరుగుబిల్లి:

పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ప్రజలు సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు కోరారు. మండలంలోని సుంకి గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య పనులను బుధవారం ఆయన పరిశీలించి, ప్రజలకు పలు సూచనలు చేశారు. తడి, పొడి చెత్తను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలన్నారు. ప్లాస్టిక్ నిషేధానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. పరిశీలనలో సర్పంచ్ కె.రవీంద్ర, డిప్యూటీ ఎంపీడీఓ ఎల్.గోపాలరావు, పంచాయతీ కార్యదర్శి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతా హి సేవ..

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీఓ ఎల్. శ్రీనివాసరావు అన్నారు. పంచాయతీ కార్యదర్శులతో తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య పనుల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొనేలా చూడాలన్నారు.